క్లుప్తంగా

ఘనంగా హనుమ ఆలయ వార్షికోత్సవం



స్వామికి పూజలు చేస్తున్న నాయకులు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు ఎన్టీఆర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలన్నారు. ఏ ప్రాంతంలో ఆధ్యాత్మికత తాండవిస్తుందో.. అక్కడ ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు గంటా వర్మ, చిన్నారావు, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం సందర్శన



బుచ్చిరాజుపాలెం హెల్త్ సెంటర్‌లో వైద్యులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం బీజేపీ నాయకులు సందర్శించారు. అక్కడ ప్రజలకు వైద్యం ఏవిధంగా అందుతుందో పరిశీలించారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ నాదెళ్ల జ్యోతి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లవుతున్న నేపథ్యంలో కేంద్ర నిధులతో పని చేసే హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించామని తెలిపారు. పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త దాడి పురుషోత్తం నాయుడు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సుహాసిని, చాలా మంజుల, పల్లి మాధవి, గొడివాడ వెంకటేశ్వర్లు, వలిరెడ్డి శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణపై స్పెషల్ డ్రైవ్

తాటిచెట్లపాలెం: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం విశాఖ రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సూపరింటిండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ రాహుల్‌దేవ్, డిప్యూటీ సూపరింటిండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావుల ఆదేశాల ప్రకారం రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంలపై ఈ కార్యక్రమం చేపట్టారు. మత్తుపదార్థాలు కుటుంబాలను ఎలా చిన్నాభిన్నం చేస్తాయో, వాటి వినియోగం, రవాణా చేయడం వల్ల ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందో జీఆర్పీ సిబ్బంది ప్రయాణికులకు వివరించారు. ఇటువంటి వాటికి అలవాటు పడితే కలిగే అనర్థాలను తెలిపేందుకు అవగాహన కల్పించి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు కలిగి ఉండటం, రవాణా చేయడం కూడా నేరమని, ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిని కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.
నేడు క్షీరాభిషేక సేవ : కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు.

'ఆణిముత్యాలు'కు పురస్కారాలు

- సీఎం జగన్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు పునరుజ్జీవం
- విద్యారంగంలో సంస్కరణలతో చక్కని ఫలితాలు
- కొనియాడిన వక్తలు
- విద్యార్థులకు ప్రశంసలు



కొత్తపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న గోపీ, పైడిరాజు



పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన మణికంఠను సత్కరిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తుకు చక్కని పునాదులు వేస్తున్నారని 61వ వార్డు కార్పొరేటర్ సుధ అన్నారు. చదువులో చక్కని ప్రతిభను కనబరిచి మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి నగదు ప్రోత్సాహకాలు అందించడం చక్కని పరిణామమన్నారు. మల్కాపురం పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పేరిట నగదు పురస్కారాలను అందజేశారు. మల్కాపురం పాఠశాల పదో తరగతి విద్యార్థి మణికంఠ స్వామి నియోజకవర్గ టాపర్‌గా నిలవడంతో ప్రథమ బహుమతిగా రూ.15 వేల నగదు, జ్ఞాపికను కార్పొరేటర్ చేతుల మీదుగా అందించారు. పాఠశాల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన మణికంఠ స్వామికి రూ.3 వేలు, రెండో స్థానంలో నిలిచిన శ్రీనివాస్‌కు రూ.2 వేలు, మూడో స్థానంలో ఉన్న గౌతమికి వెయ్యి రూపాయలు అందజేశారు. అంతేగాక కార్పొరేటర్ సుధ మణికంఠస్వామికి తన సొంత నిధుల నుంచి 3 వేల రూపాయలను అందించి, అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని లంక అరుణకుమారి, ఉపాధ్యాయుడు కుమార్, నాయకులు దాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపాలెం హైస్కూల్లో..

గోపాలపట్నం: జగనన్న ప్రభుత్వంలో విద్యకు పెద్ద పీట వేస్తున్నారని వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు ఆయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ (గోపీ), నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు అన్నారు. కొత్తపాలెం హైస్కూల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గోపాలకృష్ణ చేతులమీదుగా నగదు ప్రోత్సాహకాలను అందించారు. పాఠశాల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.3000, రూ.2వేలు, రూ.1000 చొప్పున నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడి హయాంలో ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా విస్మరించారని, చాలా పాఠశాలలను మూసి వేసేందుకు ప్రయత్నించారని గుర్తు చేశారు. కానీ, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలలకు పునరుజ్జీవం వచ్చిందన్నారు. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించారని తెలిపారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు నాలుగేళ్లలో చాలా సంస్కరణలు చేశారన్నారు. పాఠశాలల రూపురేఖలు మార్చారని పేర్కొన్నారు. వాటిని వినియోగించుకుంటూ విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని రత్నకుమారి, పాలమరశెట్టి జగదీష్, నారిపిన్ని చిన్ని, ఆడారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

కేవీ-2లో ముగిసిన 'జన్ భాగిదరి'



జూమ్ శిక్షణలో కేవీ-2 విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు



ఆన్‌లైన్‌లో శిక్షణ పొందిన వివిధ కళారూపాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



వేషధారణతో ఆకట్టుకుంటున్న విద్యార్థిని



కంచరపాలెం: చిన్నారుల చిట్టి చిట్టి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా శాఖ భాగస్వామ్యంలో దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయ సంస్థ ద్వారా నిర్వహించిన జన్ భాగిదరి కార్యక్రమం గురువారంతో ముగిసినట్లు కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేంద్రీయ విద్యాలయం-2 ప్రిన్సిపాల్ సిహెచ్.శ్రీనివాసులు తెలిపారు. జూమ్ ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు ఆన్‌లైన్‌లో జీ-20 సదస్సు, జాతీయ విద్యా విధానం-2020, ప్రాథమిక అక్షరాస్యత, సాంఖ్యా శాస్త్రంపై విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారన్నారు. ఆన్‌లైన్, జూమ్ సమావేశాల్లో ప్రదర్శనలు, సదస్సులు, క్రియాకలాపాల్లో 1 నుంచి 12 తరగతుల విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. తమ పాఠశాలలో జన్ భాగిదరి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు, తల్లిదండ్రులకు వేసవి సెలవుల్లో ఎంతో జ్ఞానార్జన జరిగిందన్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు దేశ అభ్యున్నతికి దోహదం చేయగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 21 నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. అదే రోజు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

వైద్య రంగానికి ముఖ్యమంత్రి పెద్దపీట



ఆరోగ్య కేంద్రంలో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింథియా: రాష్ట్రంలో వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్, విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 63వ వార్డు క్రాంతినగర్‌లోని వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సుమారు రూ.20 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ గోడకు గురువారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ఆడారి, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో పీపీపీ పేరిట జరిగిన నిధుల దుర్వినియోగాన్ని జగనన్న అరికట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకే ఆరోగ్య కేంద్రాలను నిర్మించారన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ఆరోగ్యశ్రీ లేని వారికి కూడా సీఎం సహాయ నిధి ద్వారా లబ్ధి చేకూర్చి పేదల పాలిటి పెన్నిధిగా మారారని కొనియాడారు. అనంతరం స్థానిక ముస్లిం మహిళలు తమ సమస్యలను ఆడారి ఆనంద్‌కుమార్‌కు విన్నవించగా.. తక్షణమే స్పందించిన ఆయన వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా, స్థానిక నాయకులు రమణమూర్తి, ఎస్.రవి గౌరీశ్వరరావు, కె.కె.నాయుడు, కమల్ రమణ, నమ్మి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు లక్ష్మీనగర్ ఈ బ్లాక్ వద్ద బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేసి 8 ఏళ్లయిన సందర్భంగా గురువారం బీజేపీ స్పోక్స్ పర్సన్ సుహాసిని ఆనంద్, ఓబీసీ విభాగం విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసరావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాలాది విజయ, ఆదినారాయణ, మాధవిలత, జ్యోతి, వెంకటేశ్వర్లు, మంజుల, జి.సామ్రాట్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ అండగా సీఎం జగన్



58వ వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: రాష్ట్రంలోని ప్రతి పేదవాడి మోముపై చిరునవ్వుకు కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ సూక్ష్మ చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 58వ వార్డు ఉప్పర కాలనీలో గురువారం సాయంత్రం కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని నివాసులకు వివరించి వాటి కరపత్రాలను అందజేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అండగా సీఎం వైఎస్ జగన్ నిలిచారని, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్కువ సమయంలో అన్ని రకాల సేవలు, పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనని కొనియాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వందలాది ప్రజా సమస్యలు తక్షణం పరిష్కరిస్తున్నారన్నారు. ఈ నెల 23 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులను గుర్తించి వారికి ఆగస్టు 1న వివిధ సంక్షేమ పథకాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.కృష్ణ, చుక్క వరలక్ష్మి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జగనన్న విద్యా కానుక

పాఠశాలల్లో చురుగ్గా పంపిణీ



విద్యార్థులకు విద్యా కానుక అందిస్తున్న కృష్ణ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం, శ్రీహరిపురం వద్ద గల జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను గురువారం అందజేశారు. ఆయా పాఠశాలల వద్ద నిర్వహించిన కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గులిగిందల కృష్ణ అతిథిగా పాల్గొని, విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారని, వాటిని వినియోగించుకుని ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తపాలెం హైస్కూల్లో..

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు వైఎస్సార్ సీపీ వార్డు నాయకులు ఆయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు చేతుల మీదుగా జగనన్న విద్యా కానుకలు అందించారు. పాఠ్యపుస్తకాలు, బ్యాగ్, షూ, యూనిఫాం తదితర సామగ్రితో కూడిన కిట్‌ను అందజేశారు.

బాక్సర్ రేష్మా యాదవ్‌కు సత్కారం



రేష్మా యాదవ్‌ను సత్కరించి అభినందిస్తున్న కార్పొరేటర్ కొణతాల సుధ

మల్కాపురం: ఇటీవల ముంబైలో జరిగిన జాతీయ స్థాయి బాలికల బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన వాకాడ రేష్మా యాదవ్‌ను 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ శాలువాతో సత్కరించారు. మల్కాపురం గొల్ల వీధికి చెందిన రేష్మా యాదవ్ ఈ పోటీల్లో బంగారు పతకం సాధించింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సుధ మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల మైదానం వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రేష్మాకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణరావు రేష్మాను ప్రశంసించారు. ప్రధానోపాధ్యాయిని అరుణకుమారి, ఉపాధ్యాయుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు, కళంజియా సభ్యులు

సింథియా: ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్కాపురం కళంజియా సమాఖ్య సారథ్యంలో గురువారం 63వ వార్డు కాకరలోవలోని కళంజియా క్లస్టర్ కార్యాలయంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వాహకులు మాట్లాడుతూ పలు నియమాలు పాటిస్తే క్యాన్సర్ రాకుండా తొలి దశలోనే గుర్తించి పూర్తిగా నివారించవచ్చన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.సుభద్ర మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళా ఎప్పటికప్పుడు గైనకాలజిస్టును సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, ఆహారంలో తగు పోషకాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ క్యాంప్‌లో 100 మందికి పైగా కళంజియా సమాఖ్య సభ్యులకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. వారిలో నలుగురికి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వారిని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, క్యాంప్ కో ఆర్డినేటర్ శివరామకృష్ణ, వైజాగ్ రీజినల్ కో హెల్త్ ఆర్డినేటర్ మురళీకృష్ణ, సమాఖ్య కో ఆర్డినేటర్ సుభాషిణి, హెల్త్ అసోసియేట్ విజయ, సమాఖ్య సిబ్బంది చంద్రకళ, తులసి, వరలక్ష్మి, కృష్ణవేణి, ధనలక్ష్మి, సమాఖ్య నాయకులు పార్వతి, క్లస్టర్ ఈసీ లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు

- ఎంతటి వారైనా పార్టీకి కట్టుబడాల్సిందే..
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



60వ వార్డు కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: పార్టీకి ద్రోహం, నష్టం కలిగించే పనులు చేస్తే క్షమించేది లేదని, అలాంటి వారు ఎవరైనా.. ఎంతటి వారైనా సరే ఉపేక్షించనని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ హెచ్చరించారు. 58వ వార్డు పిలకవానిపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం పార్టీ 60వ వార్డు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. 60వ వార్డు ప్రాంత యువ నాయకుడు బిల్డర్ శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అతిథిగా ఆయన మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్తకు తప్పక గుర్తింపు వస్తుందన్నారు. 2024 ఎన్నికల్లో పశ్చిమలో ఈ సారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరబోతుందని జోస్యం చెప్పారు. కార్యకర్తలు తమ వార్డు పరిధిలో ఏవైనా ప్రజా సమస్యలు ఉంటే తప్పక తన దృష్టికి గానీ, కార్పొరేటర్ల దృష్టికి గానీ తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. త్వరలో నియోజకవర్గ పరిధిలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. పశ్చిమను ఆదర్శంగా తీర్చిదిద్దే పనుల్లో భాగంగా ఇప్పటికే కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్, కార్పొరేటర్లు గులిగిందల లావణ్య, గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు, నాయకులు అంగ రామ్ ప్రసాద్, నరేష్, పిలక రామ్మోహన్‌రెడ్డి, గులిగిందల కృష్ణ, మళ్ల ధనలత, పిల్లా కన్నాబాబు, పూండి మల్లేశ్వరరావు, గుంట సుందర్‌రావు, శరగడం పతీన్రావు తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరునికి అభిషేకం

సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో స్వామికి త్రయోదశి ప్రదోషకాల అభిషేకాన్ని గురువారం విశేషంగా నిర్వహించారు. పంచామృతాలతో స్వామికి అభిషేకం చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా మరిడిమాంబ పండగ



ఘటాల ఊరేగింపులో అలరించిన పులివేషాలు



ఆలయం వద్ద అన్నప్రసాదం వడ్డిస్తున్న దాతలు

సింథియా: సింథియా మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు గురువారం వైభవంగా నిర్వహించారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారు సైతం పండగ మహోత్సవాలకు హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచి ఆలయానికి పోటెత్తిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, చీర, సారె, పసుపు, కుంకుమ సమర్పించారు. సాలాపు రామారావు, ఇతర భక్తులు అమ్మవారికి వెండి కిరీటాన్ని బహూకరించారు. శ్రీ సాయి ఆయిల్ ఫీల్డ్ డైరెక్టర్ బుల్లెస్‌కుమార్, జీఎం జగదీష్‌వర్మ, ఎం.లక్ష్మణకుమార్, చిట్టి, సూరాడ మోహన్‌కుమార్, రమేష్ తదితరులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం భారీ బాణసంచా నడుమ పులివేషాలతో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. అనంతరం అమ్మవారికి భోగం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ



కాలేజీ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న డాక్టర్ రావ్, ప్రొఫెసర్ సాంబశివరావు

మురళీనగర్: మొక్కలను సంరక్షించినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ వోఎం రావ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా గురువారం నిర్వహించిన మొక్కల పెంపకం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. విద్యార్థులు నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాల్లో మొక్కల పెంపకం, వాటి సంరక్షణ బాధ్యతను ప్రధాన అంశంగా తీసుకోవాలని సూచించారు. ఒక చెట్టును నరికితే దాని స్థానంలో మరో చెట్టుతోపాటు పది మొక్కలు నాటాలన్నారు. ప్రొఫెసర్ ఎన్.సాంబశివ రావు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ నియంత్రణకు పచ్చదనం పరిరక్షణ ప్రధానమని వివరించారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకం తగ్గించుకోవాలన్నారు.

మహిళా కళాశాల విద్యార్థినికి గోల్డ్ మెడల్



కృష్ణవేణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపక బృందం

దాబాగార్డెన్స్: ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ముంబైలో నిర్వహించిన నేషనల్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థి బి.కృష్ణవేణి స్పీడ్ స్ప్రింట్ 30 సెకండ్స్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. డబుల్ అండర్ 30 సెకండ్స్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. కళాశాలలో గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభా రాణి పాల్గొని కృష్ణవేణిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, కళాశాల ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ కేవీఎల్ శిరీష, బోటనీ విభాగాధిపతి డాక్టర్ ఏహెచ్‌డీ పుష్పలత, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు కృష్ణవేణిని అభినందించారు.